# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | బి.పి. కరుణాకర్ రెల్లు కథ - సామాజిక చిత్రణ | - అల్లు వివేక్ | 6 |
| 2. | రాసాని రచనలు - కుటుంబ సంబంధాలు - మానవీయత | - జి. నాగరాజు | 9 |
| 3. | జానపద గేయాలలో సామాజిక జీవనం | - భైరి నాగయ్య | 12 |
| 4. | హెబ్బలి హైమావతి కథలు - భార్య భర్తల మధ్య సంబంధం | - పులి చిన్న బాబు | 16 |
| 5. | ఆవుల సాంబశివరావు - నవభావన | - రుత్తల శ్రీధర్ | 20 |
| 6. | "అలనాటి రాయలసీమ రత్నాలు - ఒక అవలోకనం" | - డా॥. డి. సహదేవుడు | 24 |
| 7. | పద కవిత్వం - ఆత్మాశ్రయత్వం | - డా॥. డి.ఉదయకుమారి | 28 |
| 8. | పాటపై కరోనా మహమ్మారి ప్రభావం | - డా॥. జి.వెంకట రమణ | 30 |
| 9. | ఆలిస్ మన్రో ఆంగ్ల కథలు : మహిళా పాత్రల చిత్రీకరణ | - డా॥. కె. రేవతి | 34 |
| 10. | రంథి సోమరాజు గారి 'సిన్నమ్మ వొచ్చింది' | - డా॥. ఇ.కోన ప్రభ | 42 |
| 11. | పోలి కైఫీయత్తు విశేషాంశాలు | - డా॥. పొన్నంరెడ్డి కుమారి నీరజ | 45 |
| 12. | మరో 'మాల్గుడి డేస్' సత్యం శంకరమంచి 'అమరావతి కథలు' | - డా॥. ఎం. హరికృష్ణ | 49 |
| 13. | తెలుగు సాహిత్యం - ప్రజా కవిత్వం | - డా॥. ఎం. మునిరత్నం | 55 |
| 14. | బంజారా భాషపై మరాఠీ భాష ప్రభావం | - డా॥. మంత్రి శ్రీనివాస్ | 60 |
| 15. | పారిజాతాలను పరిమళింప చేసిన పూలతోట 'దార్లమాట' | - డా॥. పి. విజయకుమార్ | 68 |
| 16. | జ్వలించే దళిత హృదయం 'ఊరబావి' | - డా॥. పల్లా కృష్ణ | 71 |
| 17. | జానపద భాషా సాహిత్యం | - డా॥. వి. గోపాల్ | 75 |
| 18. | అల్లం రాజయ్య కథలు - స్త్రీ జీవిత చిత్రణ | - డా॥. వేల్పుల కుమారస్వామి | 78 |
| 19. | నవలానాయకునిగా డా॥ అక్కినేని పాత్రల విశ్లేషణ | - జి. ఎ. జె. ప్రకాశిని | 83 |
| 20. | ప్రాచ్య పరిశోధన సంస్థలోని అముద్రిత తెలుగు శతకాలు ... | - కె. సంతోష్ కుమార్ | 86 |
| 21. | వి. ఆర్. విద్యార్థి కవిత్వం - శాంతి ప్రియత్వం | - పాశం శ్రీనివాస్ | 93 |
| 22. | ప్రజాకవి సుంకర సత్యనారాయణ గేయ సాహిత్యం | - పాత శ్రీనివాసరావు | 97 |
| 23. | రజక వృత్తి విధానం ఆధునికత పరిణామం | - డా॥. వై. సుభాషిణి & | 101 |
| | | - డా॥. బి. లక్ష్మిప్రియ | |
| 24. | డా॥. చినమిల్లి సత్యనారాయణ సామాజిక సాంస్కృతికాంశాలు | - డా॥. పిట్టా శాంతి & | 107 |
| | | - డా॥. బూసి వెంకటస్వామి | |
| 25. | Complications of Language Maintenance and Language | - Dr. M. Prasad Naik | 111 |
| 26. | The History of Boya Caste in Medieval Andhradesa | - Dr. Surepalli Venkataratnam | 118 |
| 27. | Revisiting B. R. Ambedkar's work on Women's Rights | - Dr. DeepikaNayak & | 124 |
| | | - Dr. Rani Susmitha | |
| 28. | Subbarama Dikshitar - Conserver of Carnatic music | - Bindu J R & | 129 |
| | | - Dr. V Janaka Maya Devi | |
| 29. | Socio-Realities : The Portrayal of 'Sitara' in Kavery .. | - Prof. M. Neeraja | 134 |
| 30. | A Comparative Study of Yogangas in Yoga Upanishads | - Saibaba CH & | 141 |
| | | - Dr. Ramesh Babu K | |
| 31. | AcharyaPrafulla Chandra Ray : Some Reflections on ... | - SuchandrikaHazra | 146 |
| 32. | Emotional Intelligence of Higher Secondary Students... | - Rumti Das | 157 |

# జ్వలించే దళిత హృదయం 'ఊరబావి'

- డా॥. పల్లె కృష్ణ, తెలుగు ఉపన్యాసకులు, సియస్‌యస్‌ఆర్ & యస్‌ఆర్‌ఆర్‌యమ్ డిగ్రీ మరియు పిజి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యాన్ని దుక్కి దున్ని వ్యవసాయం చేసి, కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ వంటి పంటలను పండించిన కవి, కథకుడు, నవలా కారుడు, నాటక రచయిత, విమర్శకుడు మరియు విద్యావేత్త అయిన ఆచార్య 'కొలకలూరి ఇనాక్'గారు మంచి పరిశోధకులు, సహృదయులు కూడా. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు గుంటూరు జిల్లా వేజండ్ల గ్రామ నివాసి. 1939లో శ్రీమతి విశ్రాంతమ్మ, శ్రీరామయ్య దంపతులకు జన్మించారు. 42 సంవత్సరాల పఠన, పాఠన, పరిశోధన పరిపాలనానుభవం పొందారు. తెలుగు సాహిత్యంలో బహుముఖ ప్రజ్ఞాపాటవాలు గల పండితులు కీర్తి గడించారు. వీరి రచనలు ఆంగ్ల, కన్నడ, తమిళ, హిందీ, ఫ్రెంచ్, జర్మన్ భాషల్లోకి అనువాదిత మయ్యాయి. వీరి పర్యవేక్షణలో ఎంతో మంది పి.హెచ్.డిలు, ఎం.ఫిల్. డిగ్రీలు చేశారు. వివిధ విశ్వవిద్యా లయాల్లో వీరి రచనలపై చాలా మంచి పరిశోధనలు వెలువడ్డాయి.

మనిషి మార్పుకులోనైనట్లుగానే సాహిత్యంలోనూ మార్పులు వచ్చాయి. కేవలం నీతులు చెప్పడానికే కాదు సాహిత్యం. సమాజంలో సమూలనైన మార్పులు తేవచ్చని రచయితలు భావించారు. సమాజాన్ని యధాతథంగా చిత్రించడమేకాదు, చర్చకు పెట్టి దాని స్వరూపం మార్చ వచ్చని భావించారు. దానితో కథా వస్తువు మారింది. ఆకాశంలో సంచరించే పాత్రల్ని నేలకు దించి తన చుట్టూ ఉన్న మనుషుల్ని పాత్రలుగా స్వీకరించడం జరిగింది.

మంచితనం మరుగునపడి జీవితంలో అలజడి నిండి తాత్విక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మారుతున్న జీవనసరళితో మార గల్గిన నాడే జీవితంలో గెలుపు చవిచూడగల్గుతారని రచయితలు గుర్తించారు. సామూ హిక చైతన్యం పురికొల్పి, పురివిప్పితేతప్ప ఉద్యోగాల్లోనో, చదువుల్లోనో చోటు కల్పించినంత మాత్రాన దళిత జీవితాలు గట్టెక్కవని రచయితలు ఆలోచన. పాశ్చాత్యీ కరణ, పరాయీకరణల పెనుతుఫానులో ఇరుక్కుని వేళ్ళతోపాటు పెకల్చబడి విసరివేయబడుతున్న పల్లె జీవితాలు, పంటలు శిథిలం అవుతుండడం వంటి అంశాలు రచయితలు కథావస్తువుగా స్వీకరిస్తున్నారు. ఈనాడు కథంటే మానవకథ. మాన్యతగన్న సామాన్యుని కథ. అతనిచుట్టూ ఉన్న సమాజశక్తుల పరస్పర వైరుధ్యంలోంచి పుట్టిన బాహ్యాభ్యంతర సంఘర్షణల కథ. అందువల్ల కథాగత పాత్రలు మానవ సహజమైన ఆశ నిరాశలనూ, సాఫల్య వైఫల్యాలనూ, రాగద్వేషాలనూ, స్వార్థ నిస్వార్థాలనూ అత్యంత స్వాభావికంగా ప్రదర్శి స్తాయి.

సమకాలిక జీవితంలోని వాస్తవికత సంపూర్ణంగా ప్రదర్శించే స్వభావం కేవలం ఆధునిక కథలలోనే ప్రతి బింబిస్తుంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నా సాహిత్యంలో ఆధునికతకు, సులభ గ్రాహ్యతకు ప్రతినిధి కథానిక. అందుకే దానికి పాఠకు లెక్కువ. అలాంటి కథానిక ప్రక్రియను తనదైన శైలితో సుసంపన్నం గావించారు ఇనాక్‌గారు. వీరి కథానికలకొక ధ్యేయం ఉంది. సామాన్య ప్రజానీకం నుంచి అసాధారణ మేథావి వరకు దూసుకుపోయే చొరవ ఉంది. ఆత్మీయత ఉంది, అవగాహనకు అనువుగా, చైతన్య స్రవంతితో, క్లుప్తతతో, నిబద్ధతతో రచించడం వల్ల వీరి కథానికలు వివిధ భాషల్లోకి అనువాదం చెంది విస్తారంగా పాఠక లోకాన్ని సంపాదించి పెట్టాయని చెప్పవచ్చు. ఆచార్య

కొలకలూరి ఇనాక్ గారి కథాసంపుటాలలో ఊరబావి కథల సంపుటి విశిష్టమైన రచన.

"ఊరబావి" అనే కథల సంపుటి ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు 1966-72 కాలంలో రాసిన కథానికలుగా తెలియజేశారు. ఇందులో నుండి "ఊరబావి" అన్న కథను పరిశీలించినప్పుడు - గ్రామీణ జీవితాన్ని గురించి చాలా అద్భుతంగా చిత్రించారు. గ్రామీణుల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు అనుభవించే కష్టాలు, నాటి మానవ సంబంధాలు, ముఖ్యంగా అంటరానితనం వంటి అంశాలను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు.

ఒక వ్యక్తి, ఒక సమాజం, ఒక అలవాటు, ఒక దృక్కోణం, ఒక సంఘటన, ఒకసమస్య, ఒక పరిస్థితి, ఒక వ్యవస్థ, ఒక ఆలోచన, ఒక సవరణ, ఒక సంఘర్షణ - ఇలా కొలకలూరి ఇనాక్‌గారి కథలకు ఇతివృత్తం అనేది బహుముఖీనం. సమాజంలో ఎక్కువ మందికి పరిచయమై ఎక్కువ మంది ఆలోచనల్లో సుళ్ళు తిరుగుతున్న విషయాన్ని స్వీకరించి దానికి ఒక పరిష్కారాన్ని సూచిస్తూ కొంత వెలుగును ప్రసరింపచేస్తారాయన.

పుట్టిన ప్రతి మనిషిని సమస్యలు స్వాగతిస్తూనే ఉంటాయి. ఆ సమస్యల సుడిగుండం నుండి బయట పడి, నిలబడడం మానవధర్మం. సమస్యలను చూసి భయపడటం, బాధపడటం, బలికావడం, బ్రతుకు చాలించడం వంటి బలహీనతలకు లొంగిపోక తన కర్తవ్యాన్ని ధర్మం తప్పకుండా పాటిస్తూ జీవించడమే నిజమైన మనిషి లక్షణంగా ఇనాక్‌గారి "ఊరబావి" కథానిక మనకు దర్శనమిస్తుంది.

మనిషి మనిషిగా బ్రతకడం మరచి సాటి మనిషిని మనిషిగా గుర్తించకపోవడం ఈ కథానికలలో మనకు కన్పిస్తుంది. కులమతాల గోడలక్రింద నలిగిన జీవితాలు, అహంకార జ్వాలలకు బుగ్గిపాలైన బ్రతుకులు, ధనస్వామ్య కుర్చీలక్రింద నలిగిన దళితుల వ్యథలు ఈ ఊరబావి కథానిక.

శతాబ్దాలుగా దళితులు అనుభవిస్తున్న, ఎదుర్కొంటున్న కష్టాలు, కన్నీల్లు ప్రజల జీవనవిధానం ఒక విషాద దృశ్య కావ్యంగా కళ్ళముందు కదలాడుతుంది. సమాజంతో గాఢ పరిచయం, స్పందించే హృదయం, నిజాయితీ, చిత్తశుద్ధి, విశిష్టమైన వ్యక్తిత్వం, అనుభూతుల్ని, ఊహల్ని, వ్యక్తీకరించే నేర్పు ఇనాక్‌గారికి ఉండడం చేత ఊరబావి కథానిక గతానుగతికం కాక రచయితయొక్క ఒక ప్రత్యేకమైన గొంతు, విభిన్నంగా చెప్పేతీరు ఆద్యంతం కన్పించి ఆ కథ సహృదయుల మనస్సులకు దగ్గరయింది. కథలో జీవం, జీవితం ఉండడం కన్పిస్తుంది.

ఇది వరకు దళిత నేపథ్యంతో ఎన్నో కథానికలు వచ్చినప్పటికీ, దళితుల వృత్తుల గురించి మరియు వారి జీవితాలను గురించి ఇంత నిశితంగా, బలంగా తెలిపిన ప్రత్యేక కథ 'కొలకలూరి ఇనాక్'గారు రచించిన "ఊరబావి" కథానిక అని చెప్పవచ్చు.

'ఊరబావి' కథానికను పరిశీలిస్తే ఒక మంచి కథానికకు ఉండవలసిన లక్షణాలన్నీ ఈ కథానికలో కన్పిస్తాయి. ఈ కథానికలో సంభాషణలు, వర్ణనలు కూడా సందర్భానికి తగిన విధంగా ఉండి ఆకట్టుకుంటాయి. కథానిక ప్రారంభంలోనే "ఊరబావి చుట్టూ జనం మూగారు. తొంగి చూచిన వాళ్ళు ముఖాలు చిట్లించుకొని వికారంగా కనిపిస్తున్నారు. బారెడు పొద్దెక్కినా బావి గచ్చుమీద నీటి చెమ్మలేదు. బావి పక్క మురుగు గుంటలో బ్రతుకు తెల్లవార్చుకొంటున్న కప్ప ఒకటి కుంట వెలుపలకు వచ్చి, తల బైటికి వెళ్ళబెట్టి చూస్తూ ఉంది." - అంటూ మర్మగమ్యంగా సహజ వర్ణనతో కథ ప్రారంభించారు రచయిత. ఊరబావికి అటువైపు ఊరు, ఇటువైపు పల్లెలు ఉన్నాయి.

ఊరబావి కథలో ప్రధాన పాత్రలు మునసబు, రాముడు, రాముడి కొడుకూ, చిదంబరం, చిదంబరం భార్యా, లా చదివిన సత్యనారాయణ, రైతు నాంచారయ్య ప్రదాన పాత్రదారులు. మునసబు పల్లెవాళ్ళు తమ కోసమే పుట్టినట్లుగా తమ బానిసలు భావించే స్వభావం గల

వ్యక్తి. రాముడు పాత తరం మనిషి. ఊళ్ళోని పెద్దల పట్ల, రైతుల పట్ల విశ్వాసంతో మసలుకొంటూ వారు ఏం చెప్పినా చిత్తం దొర! అంటూ వారు తిట్టినా, కొట్టినా శాంతంగా సర్దుకు పోయే స్వభావం గల సగటుజీవి. కానీ రాముడి కొడుకు చిదంబరం అలా కాదు దుడుకు స్వభావంగల వ్యక్తే అయినా చిన్నతనం నుంచీ తండ్రి పోసిన పిరికి మందు తాగి, ఆరడుగుల శరీరంతో బలంగా పెరిగినా ధైర్యంగా ఎదిరించలేని వ్యక్తి. ఇక చిదంబరం భార్య చిదంబరం లాగే భర్తకు తగిన శరీర సౌష్ఠవంతో బలంగా ఉండడమే కాకుండా, చురుకుదనం, పట్టుదల, ధైర్యసాహసాలు కల్గిన స్త్రీ మూర్తిగా రచయిత పాఠకులకు పరిచయం చేస్తారు.

అలాగే నాంచారయ్య ఒక మంచి రైతు. రాముడి కుటుంబం నాంచారయ్యకే పని చేస్తుంది. ఇక సత్య నారాయణ ఊళ్ళోని పెద్దింటోడే అయినా మంచి ఆదర్శ భావాలు గల ఉన్నత వ్యక్తి. లా చదివికూడా అందరితోను కలిసి పోయే వ్యక్తి. ఇలా కథలోని పాత్రలను చాలా పొదుపుగా, పొందికగా మలిచారు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు.

రచయిత నాటి పరిస్థితిని చెబుతున్నట్లు - భయం ప్రాతిపదిక మీద బతుకుతున్న ఈ ఊరు, ఈ దేశం, ఎంత కాలం జీవిస్తాయి? ప్రేమ ప్రాతిపదికమీద బతికే సమాజం, వ్యవస్థ ఏ రోజు పుడతాయి? పోని, నిర్భయంగా జీవించే మానవ జీవితం ఎంత దూరంలో ఉంది ? అని ప్రశ్నించడం గొప్పగా ఉంది.

కథలో ముఖ్యంగా మనకు అనేక అంశాల ప్రస్తావన కన్పిస్తుంది. పల్లె జనుల అమాయకత్వం, నిరక్షరాస్యత, బానిసత్వం, మూఢత్వం వంటివి నాడు ఎంత బలంగా ఉన్నాయో తెలియజేస్తుందీకథ. మొత్తంగా దళితులు తమకోసమే పుట్టారనుకునే పెత్తందారి సమాజం వారిని దేవుని దర్శనానికి కూడా దూరం చేసి, స్వేచ్ఛా రహితు లుగా, బొమ్మలుగా ఆడించే వైనం కన్పిస్తుంది.

భాషా విషయానికి వస్తే చక్కటి మాండలికాన్ని పాత్రోచితంగా ఉపయోగించారు. ఉదాహరణకు -

“నేనెత్తేదేంది, సెప్పు !”

“నువ్వెత్తేదేంది దొరా ! నువ్వేందెత్తేది ?”

“పొట్టు, ఎత్తుతా, పొట్టవే”

“ఆళ్ళ నోళ్ళలో పురుగులు బడతా యెపుడన్నా సరే !”

“ఎమికలిరగదన్నే వోళ్ళేక, సన్నాయిసీ అడుగుతావంటారా ?”

“ఎన్నాళ్ళేం దీళ్ళ దవురుజెన్నేం ?”

వంటి మాండలిక భాషాపదజాలంతో ప్రతి సంఘన లోనూ సందర్భోచితంగా సామాన్య వ్యవహార భాషతో పాటు తమదే అయిన ఒక ప్రత్యేకమైన భాషాశైలిని ప్రవేశపెట్టినట్లుగా కన్పిస్తుంది.

ఒక అంశాన్ని స్వీకరించి దానికి కథారూపం ఇచ్చినప్పటి నుండి ఆద్యంతం రచనలో అంతస్సూత్రంగా ఒక విధానం లేదా ఒకే విధానం సాగుతుండడం శైలి అవుతుంది. శైలి రచయిత భావనకు, భాషకు, వర్ణనలకు, ప్రతిభకు సంబంధించిన రచనా అంశం. ఆలోచనలను శబ్దంలోకి, వాక్యంలోకి విశిష్టంగా మార్చేది శైలీ - అంటారు ‘ఎం.హెచ్. అబ్రమ్స్’ తన ‘గ్లోసరీ ఆఫ్ లిటరరీ టర్మ్స్’లో.

శైలీ అనేది వ్యక్తి నుండి వ్యక్తికి విభేదిస్తుంది. ఇది రచనకు సంబంధించిన అంశం కనుక రచయిత యొక్క ప్రతిభా పాటవాలు, వ్యుత్పత్తి, అభ్యాసాలకు అతని ఆలోచనలకు, వ్యక్తిత్వానికి, భావ తీవ్రతకు సంబంధించి ఉంటుంది, కనుక ఒకరితో మరొకరికి పోలిక ఉండదు. “పాఠకుణ్ణి తనవైపుకు లాక్కుని, లొంగదీసుకుని రచయిత అంతరంగ జగత్తులోకి ప్రవేశింప చేయడం శైలీ లక్ష్యం” అంటాడు ‘బుచ్చిబాబు’. అటువంటి శైలీ విన్యాసాన్ని రచయిత ఈ కథలో ఉపయోగించినట్లు మనకు కన్పిస్తుంది.

ఇక ముగింపు విషయానికి వస్తే - ‘‘ముగింపు విషయంలో చాలామంది రచయితలకూ స్థిరమైన అభిప్రాయాలున్నాయి” అంటాడు ‘వల్లంపాటి వెంకట

సుబ్బయ్య' తన 'కథాశిల్పం'లో. "ముగింపులో పాఠకుణ్ణి విస్మయ చకితుణ్ణి చేసే అంశం నెలకొని ఉండడం సాధారణంగా మంచి కథల లక్షణం" అంటాడు 'మధు రాంతకం రాజారామ్'.

'ఊరబావి'లో కూడా ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి ముగింపు అలానే ఉండి పాఠకులను రంజింపచేస్తుంది. రచయిత ముగింపులో చిదంబరం భార్య తెగువను పనితనాన్ని చక్కగా వర్ణిస్తూ...

'దున్నలకు పట్టెళ్ళు బెట్టింది. అదిలించింది. బావివైపు వెళ్ళాయి. చీర తిప్పి గోచి పెట్టింది. చేంతాడు బావిలోకి వేసింది. పైకొన గిలకల పట్టెకు కట్టింది. మెట్ల మీదుగా బావిలోకి దిగింది. ఎద్దుదట్టెం కాళ్ళకు కట్టి ఉన్న మోకుల కొసలు చేతబట్టుకొంది. పైకి వచ్చింది. ఇక పక్క ఉన్న రెండు మోకులు ఒక పక్క గిలకల పట్టెకు కట్టింది. పట్టెళ్ళు బిగించింది. వడిగల రెండు దున్నల్ని రెండు చేతులతో చాచికొట్టింది. చేయి మీద వేస్తే ఆగని దున్నలు ఒక్క దూకులో ముందుకు వెళ్ళాయి. క్షణంలో దట్టెం పైకి వచ్చింది.' అంటూ ఒక మగువ తలుచుకుంటే ఏదైనా సాధిస్తుందని, మగవాళ్ళకు ఏ మాత్రం దగ్గదని నిరూపించారు.

అదేవిధంగా ఊరిలో తమ జనం పడుతున్న అగచాట్లకు పరిష్కారం స్త్రీ ద్వారా చూపించడం ఈ కథానిక స్థాయిని మరింత పెంచిందనవచ్చు.

ఒక మంచి కథకు ఉండవలసిన క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ, నిర్మాణసౌష్ఠవం వంటి అన్ని లక్షణాలను ఈ కథానిక ద్వారా ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు మనకు అందించడం గర్వించదగ్గ విషయం.

"కథానిక జీవిత సత్యాన్ని తెలిపేదిగా ఉండాలి, తద్వారా జీవిత సత్యాలు కళల ద్వారా సార్వజనీన మవుతాయి" అంటాడు రా.రా. కథానికా - దాని శిల్పమూ - అనే వ్యాసంలో. ఈ కథానిక కూడా మనకు మంచి జీవిత సత్యాన్ని తెల్పుతుందనడంలో సందేహంలేదు.

**చివరగా ఈ కథానిక ప్రత్యేకతను గురించి -**

స్వాతంత్ర్యానంతరం తెలుగులో వచ్చిన ఒకే ఒక ఉత్తమ కథానిక చెప్పాలంటే 'ఊరబావి' అని శ్రీబి.యస్. శ్రీరాములు అభిప్రాయపడటం ఆనందకరమే !-అని ఇనాక్ గారు తమ 'ఊరబావి' కథానికల సంపుటిలో 'ఇంకోమాట'లో అన్నారు.

అదేవిధంగా కేంద్ర సాహిత్య అకాడెమీ కోసం స్వాతంత్ర్యానంతరం వెలువడ్డ 60 కథానికల్ని సంకలనం చేసి ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి సంపాదకత్వంలో వెలువరించిన 'బంగారుకథలు'లో 'ఊరబావి' కథానికకు చోటు దొరికిందని కూడా తెలిపారు. అందులోని 30 కథానికల్ని అనువదింపచేసి వాళ్ళే ప్రచురించిన "Golden Nuggets"లో 'ఊరబావి' కథానిక చేరడం, జర్మన్, స్పానిష్, ఫ్రెంచి భాషల్లోకి భారతీయ కథానికల్ని తర్జుమా చేయించదలచి అంబెసీ కేంద్ర సాహిత్య అకాడెమీని కోరినప్పుడు, తెలుగు నుంచి మూడు కథానికలు కావలసిరాగా, మూడింటిలో ఊరబావిని ఆయనే చేర్చి పంపటం ముదావహమన్నారు.

ఊరబావిని 'గావ్ కా కువా'గా తర్జుమా చేసి ఆచార్య వై.వేంకటరమణారావు 'యుద్ధరత్ ఔర్ ఆద్మీ' సంకలనంలో చేర్చటం సంతోషదాయకం అన్నారు.

ఈ విధంగా ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి ఊరబావి కథానిక మన తెలుగు కథానికల స్థాయిని పెంచిందని చెప్పవచ్చు. మనలో నిద్రానమై పోతున్న చైతన్య ప్రవంతిని తట్టిలేపే కథానికల్ని తెలుగు పాఠకులే కాదు వివిధ భాషీయులు కూడా ఆదరిస్తారని తెలియ జేయడానికి ఇలాంటి కథానికలు తలమానికంగా నిలుస్తాయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆచార్య కొలకలూరి ఇనాక్ - ఊరబావి కథానికల సంపుటి. 2. వల్లంపాటి వెంకట సుబ్బయ్య - కథాశిల్పం.